
మామిడి రైతుల్లో నైరాశ్యం

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతే రైతులను ఆదుకునేది బీమా. ఉద్యాన పంటల్లో మామిడిని తొలిసారిగా పంటల బీమా పరిధిలోకి తీసుకొచ్చారు. పంట దెబ్బతిన్నపుడు తమకు అంతోఇంతో ఆర్థికసాయం అందుతుందనుకున్న రైతుల ఆశలపై కూటమి సర్కారు నీళ్లు చల్లింది. బీమా ప్రీమియం మొత్తం ఎక్కువగా నిర్ణయించడం రైతులను నిరాశపరుస్తోంది.



- పంటల బీమా పరిధిలోకి మామిడి
- ఎకరాకు రూ.1800 ప్రీమియం ఖరారు
- అంత మొత్తం చెల్లించలేమంటున్న రైతులు
- ఈ నెల 31 వరకు గడువు పొడిగించిన అధికారులు

ధర్మవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వాతావరణ ఆధారిత పంటల బీమా మామిడి రైతులకు ధీమా ఇవ్వలేకపోతోంది. ప్రీమియం ఎకరాకు రూ.1,800 చొప్పున రైతు వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. బీమా కింద పరిహారం ఎకరాకు రూ.35వేలు అందుతుంది. ఈ నెల 15వ తేదీతో ప్రీమియం చెల్లింపు గడువు ముగిసింది. రైతు వాటా ఎక్కువగా ఉండటంతో చాలామంది ముందుకు రాలేదు. దీంతో ఉద్యాన శాఖ అధికారులు చెల్లింపు గడువును ఈ నెల 31 వరకు పొడిగించారు.

విస్తారంగా మామిడి సాగు

ధర్మవరం వ్యవసాయ సబ్ డివిజన్‌లో బేనీషా, బెంగళూరు తదితర రకాల మామిడి తోటలు విస్తారంగా సాగయ్యాయి. జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూడా చాలామంది సాగు చేశారు. ముఖ్యంగా ధర్మవరం మండలంలో ఏలుకుంట్ల, బుడ్డారెడ్డిపల్లి, రేగాటిపల్లి, బడన్నపల్లి, బిల్వంపల్లి, ముదిగుబ్బ మండలంలో కూడా అధిక విస్తీర్ణంలో మామిడి తోటలు విస్తరించాయి. ఈ ప్రాంతంలో పండే మామిడి తోటలను నార్పల, కర్నూలు జిల్లా వ్యాపారులు మూడేళ్ల వ్యవధితో లీజుకు తీసుకుంటారు. ఇక్కడ పండిన కాయలను హైదరాబాద్, బెంగళూరుకు మార్కెటింగ్ చేస్తారు.

పంట నష్టం లెక్కింపుపై స్పష్టతేదీ?

వాతావరణ ఆధారిత పంటల బీమాలో ఉన్న మామిడి పంట నష్టాన్ని మండలం యూనిట్‌గానా లేదా జిల్లా యూనిట్‌గా తీసుకుని లెక్కిస్తారా? అనే విషయంపై స్పష్టత లేదు. వాతావరణ పరిస్థితులను బట్టి మాత్రమే పరిహారం అందే అవకాశం ఉంటుంది. పోనీ అదైనా సాంకేతికంగా ఎలా అంచనా వేస్తారనే వివరణ లేదు. జనవరి నుంచి మార్చి 15 లోపు ఎండల కారణంగా పంట దెబ్బతింటే, మార్చి 1 నుంచి మే 31 వరకు ఈదురు గాలుల కారణంగా పంటకు నష్టం వాటిల్లితేనే బీమాకు అర్హులని జీఓలో పేర్కొన్నారు. బీమా అమలులో ఉన్న సమయంలో మండలాల వారీగా వర్షాలు, గాలులు, ఉష్ణోగ్రతల్లో మార్పులు వేరువేరుగా ఉంటాయి. అలాంటప్పుడు మండలాన్ని యూనిట్‌గా తీసుకోవడం మేలని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గాలిలో తేమ శాతం, వర్షపాత వివరాలను ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ వాతావరణ పరికరాలతో గుర్తిస్తే నిర్దేశించిన ప్రమాణాలు ఉంటేనే బీమా వస్తుందని చెబుతున్నారు. దీనిపై రైతులకు సరైన అవగాహన రావడం లేదు.

ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో మామిడి సాగు..

మండలం	సాగు (ఎకరాల్లో)
ధర్మవరం	1,045
బత్తలపల్లి	305
తాడిమర్రి	458
ముదిగుబ్బ	2,525
కనగానపల్లి	948


ఏలుకుంట్ల వద్ద సాగవుతున్న మామిడి తోట

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి



మామిడి పంటకు బీమా వర్తింపజేయడం సంతోషమే. అయితే ప్రీమియం ఎకరాకు ఏకంగా రూ.1,,800 దాకా చెల్లించడం కష్టంగా ఉంది. పంట పెట్టుబడులకే రైతుల వద్ద డబ్బులు ఉండవు. అలాంటప్పుడు వేలాది రూపాయల ప్రీమియం సొమ్ము ఎలా చెల్లిస్తారు? ఉచిత పంటల బీమా పథకం కింద ప్రభుత్వమే ప్రీమియం మొత్తాన్ని చెల్లిస్తే బాగుంటుంది. లేదంటే సామాన్య రైతులెవ్వరూ ఇంత భారీ ప్రీమియాన్ని చెల్లించడానికి ముందుకు రారు.

– రమేష్, మామిడి రైతు, ఏలుకుంట్ల, ధర్మవరం మండలం

బీమా సద్వినియోగం చేసుకోండి



మామడి రైతులు ఈ నెల 31 వరకు బీమా ప్రీమియం చెల్లించవచ్చు. ప్రస్తుతం మామిడి తోటలు మొగ్గ, పిందె దశలో ఉన్నాయి. ఈ సమయంలో రైతులు సస్య రక్షణ చర్యలు చేపడితే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఈ ఏడాది నుంచి మామిడి పంటకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించింది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– అమరేశ్వరి, ధర్మవరం డివిజన్ ఉద్యాన శాఖ అధికారి

కరెంటు చార్జీల బాదుడుపై 27న పోరుబాట


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కదిరి టౌన్: కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 27న నియోజకవర్గ కేంద్రంలో పోరుబాట నిర్వహించనున్నట్లు పార్టీ కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ తెలిపారు. పోరుబాట పోస్టర్లను మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కరెంటు చార్జీలు పెంచేది లేదని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలపై రూ.15వేల కోట్ల భారం మోపారని మండిపడ్డారు. కరెంటు చార్జీల పెంపు పేదల పాలిట శాపంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, నాయకులు పరికి సాదిక్ బాషా, కుర్లి శివారెడ్డి, దశరథనాయుడు, కృష్ణానాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తత


సూచనలు ఇస్తున్న వెటర్నరీ డాక్టర్ బాలానాయక్, ఏఓ లోకేశ్వరరెడ్డి

ఎన్‌పీకుంట: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బాలానాయక్ పాడిరైతులకు సూచించారు. ఎన్‌పీ కుంట-1 రైతు సేవ కేంద్రం పరిధిలో మంగళవారం వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడిరైతులకు పలు సూచనలు ఇచ్చారు. గొర్రెలలో బొబ్బ, సరకా వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వీటి నివారణకు షీప్ ఫాక్స్, పీపీఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఆవులు, గేదెలలో వచ్చే ముద్దచర్మ వ్యాధికి గోట్‌ఫాక్స్ వ్యాక్సిన్ వేయించాలని తెలిపారు. కోళ్లలో కొక్కెర వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. పాడి రైతులు 50 సెంట్లలో బహువార్షిక పశుగ్రాసం పెంపకం చేపట్టి ప్రభుత్వ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు సాగు చేసిన కంది పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతుసేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి సూచించారు. జనవరి 10లోపు సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. వరి, వేరుశనగ పంటల బీమా ప్రీమియం నెలాఖరులోపు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆత్మా ఏటీఎం మౌనిక, రైతు సేవ కేంద్రం సిబ్బంది యుగంధర్, ధనలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబు


వేషధారణలతో అలరిస్తున్న చిన్నారులు


విద్యుత్ దీపాలతో ముస్తాబైన సీఎస్ కోట చర్చి

కనగానపల్లి/ బత్తలపల్లి/ తాడిమర్రి/ ఓడీ చెరువు: క్రిస్మస్ వేడుకలకు కనగానపల్లి మండలంలోని సీఎస్ కోట, తగరకుంట, మామిళ్లపల్లి, కనగానపల్లిలోని చర్చిలన్నీ అందంగా ముస్తాబైనాయి. 90 శాతంపైగా క్రైస్తవులు ఉన్న చెన్నమనాయుని కోట గ్రామంలో ఏటా క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరుగుతాయి. ఈ వేడుకలు జరిగే క్యాథలిక్ చర్చిని రంగు రంగుల విద్యుత్ బల్బులతో అందంగా అలంకరించారు. ఇక బత్తలపల్లి, తాడిమర్రి, ఓడీచెరువు తదితర మండలాల్లోనూ చర్చిలను క్రిస్మస్ వేడుకులకు సిద్ధం చేశారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ హైస్కూల్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ నిర్మలా జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల శాంతాక్లాజ్ వేషధారణ, క్రిస్మస్ ట్రీ అలంకరణ, నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ రామిరెడ్డి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసు బోధనలు అనుసరణీయం

ముదిగుబ్బ: స్థానిక పీవీఎస్ పాఠశాలలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైర్మన్ పీవీ నాయుడు మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత మార్గంలో పయనించాలి

ధర్మవరం: ప్రతి ఒక్కరూ శాంతియుత మార్గంలో పయనించాలని వక్తలు పిలుపునిచ్చారు. నాగలూరు వద్దనున్న రూపరాజా పీసీఎంఆర్ పాఠశాలలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్లు రూపరాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ఏసుక్రీస్తు, శాంతాక్లాజ్, మేరీమాత, దేవదూత వేషధారణల్లో అలరించారు.


ముదిగుబ్బలో క్రిస్మస్ వేడుకలు


ధర్మవరంలో వివిధ వేషధారణల్లో చిన్నారులు

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మక్బూల్ అహ్మద్

తలుపుల : మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు హోటల్ ధర్మారెడ్డి (70) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్ మంగళవారం మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వీరి వెంట పార్టీ మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫినాయక్, సేవాదళ్ జోన్ ఇన్‌చార్జ్ డీకే బాబు (కృష్ణారెడ్డి), నాయకులు దివాన్‌వలి, జయచంద్రారెడ్డి, యూసుఫ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


పి.ఎం.బాషా (ఫైల్)

గాండ్లపెంట: కటారుపల్లి గొల్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పి.ఎం.బాషా(47) అలియాస్ నాని సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, ఫారుక్ తదితరులు మంగళవారం గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నకిలీ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

ధర్మవరం రూరల్: నకిలీ విత్తనాలు, పురుగు మందులు, రసాయనిక మందులను విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేస్తామని ఏడీఏ కృష్ణయ్య హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి ముస్తఫాతో కలిసి ఆయన తనిఖీ చేశారు.

నిర్దేశించిన స్థలంలోనే ఆర్టీసీ బస్సులు ఆపాలి

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలో ప్రయాణికులను ఎక్కించుకోవడానికి ఆర్టీసీ బస్సులు నిర్దేశించిన స్థలంలోనే ఆపాలని జమీదార్ షౌకత్ అలీ డ్రైవర్లకు సూచించారు. మంగళవారం ఆయన ట్రాఫిక్ నిబంధనల్లో భాగంగా బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనదారులకు సూచనలు ఇచ్చారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని కోరారు.

సస్యరక్షణపై అవగాహన

గాండ్లపెంట: వేపరాలలోని లోకేశ్వరరెడ్డి తోటలో మామిడి సస్య రక్షణపై సచివాలయ ఉద్యాన సహాయకులు రాజేశ్వరి మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. పంటకు వ్యాపించే తెగుళ్లు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

సంక్షిప్త వార్తలు

కంటైనర్ బోల్తా

తనకల్లు: చీకటిమానిపల్లి సమీపంలోని ఈదులవంక వద్ద మంగళవారం కంటైనర్ వాహనం బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి వైపు వెళ్తున్న కంటైనర్‌కు బైక్ అడ్డంగా వచ్చింది. దాన్ని తప్పించబోయిన డ్రైవర్ కంటైనర్‌ను రోడ్డు పక్కకు తిప్పాడు. దీంతో వేగం అదుపుకాక కంటైనర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు, ద్విచక్ర వాహనదారుడికి స్వల్పంగా గాయాలయ్యాయి.

మందుల పంపిణీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సుబ్బదాసు సత్రంలో మంగళవారం శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వందలాది మంది ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం

తనకల్లు: కొక్కంటిక్రాస్ సత్యన్న సేన ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో రమణ, అశోక్, బాలకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ

తాడిమర్రి: పిన్నదరి గ్రామంలో నాలుగు రోజుల క్రితం బసినేని చెన్నమ్మ అనారోగ్యంతో చనిపోయింది. మంత్రి సత్యకుమార్ మంగళవారం గ్రామానికి వెళ్లి ఆమె కుమారుడు విశ్వనాథ్‌ను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఆయన భరోసా ఇచ్చారు.

కేబుల్ చోరీ

అమడగూరు: మండల పరిధిలోని సీతిరెడ్డిపల్లి, చీకిరేవులపల్లి గ్రామాల్లో వ్యవసాయ బోర్లు, మంచినీటి పథకానికి సంబంధించిన కేబుల్‌ను దుండగులు ఎత్తుకుపోయారు. ఈ మేరకు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి

కదిరి టౌన్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి కోరారు. మంగళవారం కదిరిలోని కృష్ణమందిరంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో వాల్మీకి/బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణ కోసం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో వాల్మీకి సేవా సంఘం నాయకులు గంగరాజు, బొట్టు చంద్ర, వాల్మీకి యువ నాయకులు శ్రావణ్‌కుమార్, ఆనంద్, అంజి పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

బత్తలపల్లి: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సోమశేఖర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. అనంతపురం-బత్తలపల్లి జాతీయ రహదారిపై వై జంక్షన్‌లో అనంతపురానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

చెన్నేకొత్తపల్లి: రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల సర్వేయర్ సంతోష్‌లక్ష్మి, గ్రామ సర్వేయర్లు చంద్రమోహన్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, వీఆర్‌ఓలు తులశమ్మ, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

తాడిమర్రి: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి రైతులకు సూచించారు. తిరుమలాపురం (మోదుగులకుంట) ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం ఆయన సిబ్బందితో కలసి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుశాంతి, జూనియర్ అసిస్టెంట్ దినేష్, సర్వేయర్ సావిత్రి, వీఆర్ఓ రేవతి, రైతులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని వినతి

కదిరి అర్బన్: తమకు రావాల్సిన ఐదు నెలల జీతాలను చెల్లించాలని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం తహశీల్దార్ మురళీకృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. విధులు నిర్వహించేందుకు అప్పటి ఏపీఓ శ్రీధర్‌రెడ్డి టాస్కులు ఇవ్వలేదన్నారు. ఉపాధి హామీ కూలీల నుంచి తమపై ఎలాంటి ఫిర్యాదులూ లేకున్నా నోటీసులు జారీ చేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు జీతాలు చెల్లించి విధులు నిర్వహించడానికి టాస్కులు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ముత్యాలచెరువు, కదిరి కుంట్లపల్లి, మొటుకుపల్లి ఫీల్డ్ అసిస్టెంట్లు రవి నాయక్, మారెప్ప, భాస్కర్ ఉన్నారు.

వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన



పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలతోపాటు పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు.

కూలీ దుర్మరణం

కదిరి టౌన్: గోడ కుప్పకూలడంతో శిథిలాల కింద చిక్కుకుని ఓ కూలీ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మండలం చలమకుంట్లపల్లి అంబేడ్కర్ నగర్‌లో నివాసముంటున్న గంగులప్ప (52)కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కూలీ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో కదిరిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో ఓ ఇంటి గోడలను తొలగించే పనిని ఒప్పందం చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గోడలు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు ఓ గోడ కుప్పకూలింది. శిథిలాల కింద చిక్కుకుని గంగులప్ప అక్కడికక్కడే మృతి చెందాడు.

మసీదుకు రూ.2 లక్షల వితరణ


విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్ మస్తాన్‌వలి

తనకల్లు: కొండవెనుకపల్లిలో మసీదు అభివృద్ధి కోసం కొర్తికోట మాజీ సర్పంచ్ మస్తాన్‌వలి మంగళవారం రూ.2 లక్షలు వితరణ చేశారు. కార్యక్రమంలో పలువురు ముతవల్లిలు, ఇమాంలు, మౌజన్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు


శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: నియోజకవర్గంలోని క్రైస్తవులకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏ మతమైనా విశ్వశాంతినే కోరుకుంటాయని పేర్కొన్నారు. శాంతియుత సహజీవనమే క్రిస్మస్ సందేశమన్నారు. సకల జనులందరూ సంయమనంతో కలసిమెలసి జీవించాలన్న క్రీస్తు బోధనలు మానవాళికీ ఆచరణీయమని పేర్కొన్నారు.

పదవికి వన్నె తెస్తా


రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి

పుట్టపర్తి : వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షునిగా విశ్రాంత డీఈఈ, ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ సంఘం గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పదవికి వన్నె తెస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్సీ రాచంరెడ్డి వెంకట్రామిరెడ్డి ఉపాధ్యాయుల సమస్యల సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారని, ఆయన అడుగుజాడల్లో నడిచి మేధావులను ఐక్యం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

సీపీఐ శతవార్షికోత్సవాలు జయప్రదం చేయండి

కదిరి టౌన్: ఈ నెల 26 నుంచి 30 వరకు చేపట్టే సీపీఐ శత వార్షికోత్సవాలు జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కార్మిక, కర్షక, తాడిత, పీడిత ప్రజల పక్షాన నిలిచింది కమ్యూనిస్టులేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు మధునాయక్, నరసింహులు, పవన్, రమణ, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పేపర్ల పంపిణీ

ధర్మవరం రూరల్: మోటుమర్ల వద్దనున్న కేజీబీవీలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో తయారు చేసిన మోడల్ పేపర్లను త్యాగరాజు దంపతులు తమ దివంగత కూతురు భారతి జ్ఞాపకార్థం అందజేశారు. 40 మంది బాలికలకు మోడల్ పేపర్స్‌తో పాటు అట్టలు, పెన్నులు తదితర వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, ఎస్‌ఓ చంద్రకళ, యోగా గురువు నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 11న మహాధర్నా

ధర్మవరం అర్బన్: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జనవరి 11న మహాధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గౌస్ లాజమ్, ఉపాధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యంతర భృతి ఊసేలేదని, సరెండర్ లీవ్ చెల్లింపులు, పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలు, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు టైం స్కేల్ మంజూరు చేయాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయుల రిటైర్డు వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, సీపీఎస్ రద్దు చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోసం మహాధర్నా చేపడుతున్నట్లు వెల్లడించారు.

జిమ్ యజమానిపై కేసు

కదిరి టౌన్: పట్టణంలోని అడపాల వీధి లైట్ హౌస్ సమీపంలో గల గంగాధర్ ఇంటిలోకి చొరబడిన లోటస్ జిమ్ యజమాని రమేష్‌పై పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లోకి చొరబడిన రమేష్‌ను చూసి గంగాధర్ గట్టిగా కేకలు వేశాడు. దీంతో అతడు అక్కడి నుంచి పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు జిమ్ యజమానిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

సబ్ స్టేషన్ ప్రారంభం



ధర్మవరం రూరల్: కుణుతూరులో 11 కేవీ 3 ఫేస్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంగళవారం మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, మహేష్ చౌదరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.